క్లుప్తంగా

నేడు ఆకెళ్ల రాఘవేంద్ర ప్రసంగం

నిజాంపేట్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో 'విజ్ఞానికి వస్తున్న ప్రమాదం'అనే అంశంపై స్మారకోపన్యాసం ఉంటుందని కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 6గంటలకు జరిగే కార్యక్రమానికి విద్యావేత్త ఆకెళ్ల రాఘవేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొంది.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌కు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఎంజేగార్డెన్స్‌లో చెక్కులు అందించనున్నట్లు మేయర్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, అనుబంధ కమిటీల సభ్యులు హాజరు కావాలని కోరారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సుభాష్‌నగర్: మహిళలకు స్వావలంభన సాధించేందుకు కుట్టు శిక్షణ తోడ్పాటును అందిస్తుందని సుభాష్‌నగర్ కార్పొరేటర్ హేమలత అన్నారు. సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో నిర్మాణ్ సంస్థ, గైన్‌సైట్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కుట్టు శిక్షణతో మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి దోహదపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తన మద్దతు ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్, గైన్‌సైట్ సంస్థల ప్రతినిధులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లు తరచూ ధ్వంసం



దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్‌పై ప్రమాద సూచిక

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. షాపూర్‌నగర్ నుంచి మియాపూర్ వెళ్లాలంటే ఈ దారి గుండానే ప్రయాణిస్తూ రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు భారీ వాహనాలు వెళ్లినప్పుడు తట్టుకునే సామర్థ్యం గల మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ధ్వంసమవుతున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి నాణ్యతతో కూడిన మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బస్‌పాస్ కౌంటర్ పనివేళలు

రాయదుర్గం: ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్ సమాచారం బస్‌పాస్ కౌంటర్ ప్రాంతం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో లింగంపల్లి బస్టాండులో రెండు బస్‌పాస్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి. నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు అన్ని ప్రభుత్వ పని దినాలలో అందుబాటులో ఉంటాయి.

'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో డా. రెడ్డీస్ ల్యాబ్‌కు చోటు



సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్'చోటు సంపాదించుకుంది. హైపర్‌టెన్షన్ నిర్వహణపై అవగాహన కల్పించినందుకు ఈ అవార్డు అందుకున్నట్లు గురువారం కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 17న డాక్టర్ రెడ్డీస్ రూరల్ హెల్త్‌కేర్ టీమ్, ఇండియా హైపర్‌టెన్సివ్ కంట్రోల్ ఇనిషియేటివ్ (ఐహెచ్‌సీఐ)ల మార్గనిర్దేశంలో సరైన హైపర్‌టెన్షన్ ట్రీట్‌మెంట్ ప్రోటోకాల్‌ను అనుసరిస్తామని గ్రామీణ భారతదేశంలోని 30,813 మంది వైద్యుల ప్రతిజ్ఞ చేశారు. వారు రాసిన సందేశాల అట్టముక్కలతో అతి పెద్ద గుండె ఆకారంలో ఇన్‌స్టాలేషన్‌ను నిర్మించారు. దాదాపు 200 కిలోల బరువున్న ఈ ఇన్‌స్టాలేషన్ బాచుపల్లిలోని డాక్టర్ రెడ్డీస్ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. డాక్టర్ రెడ్డీస్ క్లస్టర్ హెడ్ ఆదిత్య వశిష్టకు 'ఆకులను ఉపయోగించి రూపొందించిన అతిపెద్ద గుండె ఆకారపు నిర్మాణం'సైటేషన్ సర్టిఫికెట్‌ను ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత రామ్మోహన్‌రెడ్డి అందజేశారు. ఇందులో పాల్గొన్న వైద్యులందరూ డాక్టర్ రెడ్డీస్ నుంచి 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ప్రమాణ పత్రాన్ని అందుకున్నారు. ఈ ఇన్‌స్టాలేషన్‌ను ఏడాది పాటు ఉంచాలని రెడ్డీస్ ల్యాబ్ లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రైవేట్ స్థలమని యాజమాని ప్రభుత్వ స్థలమని అధికారులు!

అంతలోనే కమాన్ ఏర్పాటు చేసిన పలువురు

- కోర్టు పరిధిలోనే ఉన్న భూ వివాదం
- ఫిర్యాదును పట్టించుకోని పోలీసులు
- స్పందించని రెవెన్యూ అధికారులు
- పలు అనుమానాలకు తావిస్తున్న భూవివాదం



రోడ్డు పేరుతో రాత్రికి రాత్రే కమాన్ ఏర్పాటు చేసిన దృశ్యం

నిజాంపేట్: కోర్టు పరిధిలో ఉన్న ఓ స్థలంలో రాత్రికి రాత్రే కొందరు వ్యక్తులు గుడి పేరుతో కబ్జా చేసేందుకు జేసీబీలతో సదరు స్థలంలో ఉన్న నిర్మాణాన్ని తొలగించారు. ఆ తర్వాత దేవాలయానికి సంబంధించిన కమాన్‌ను ఏర్పాటు చేసిన విషయం గురువారం నిజాంపేట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. నిజాంపేట్ నుంచి బాచుపల్లికి వెళ్లే దారిలో సర్వే నం.326లో నిజాంపేట్‌కు చెందిన కొలను శ్రీనివాస్ రెడ్డి గతంలో నిర్మాణాలు చేపట్టారు. అయితే రెవెన్యూ అధికారులు అందులో సర్వే నం.332కు చెందిన ప్రభుత్వ స్థలం వస్తోందని భావించి కొంత భాగాన్ని కూల్చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో కొలను శ్రీనివాస్‌రెడ్డి కోర్టును ఆశ్రయించారు. అయితే 2022 నుంచి ఈ వివాదం కోర్టు పరిధిలో ఉంది.

ఫిర్యాదును పట్టించుకోని పోలీసులు..

బుధవారం రాత్రికి కొంతమంది వ్యక్తులు పక్కనే ఉన్న మల్లన్న దేవాలయానికి రోడ్డు పేరుతో సర్వే నం.326లో ఉన్న నిర్మాణాన్ని తొలగించి రోడ్డు వేసే ప్రయత్నం చేసి ఓ కమాన్‌ను ఏర్పాటు చేశారు. అయితే సదరు స్థలంలో బుధవారం అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కొలను శ్రీనివాస్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయినా వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెవెన్యూ అధికారులు స్పందించరా?

ప్రైవేటు స్థలమని యాజమాని... ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికారులు వాదించుకుంటున్నారు. ఇదిలా ఉండగానే ఆకస్మాత్తుగా మరికొందరు ఈ స్థలంలో రోడ్డు నిర్మాణం అంటూ బలవంతంగా ఓ నిర్మాణాన్ని కూల్చేయడం ఎంత వరకు సమంజసమని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మల్లన్న గుడికి ఇప్పటికే జర్నలిస్టు కాలనీకి వెళ్లే రోడ్డు మార్గంలో గేటు ఏర్పాటు చేసుకున్నారు. దేవాలయం ముందు ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ ఎలాంటి అనుమతులు లేకున్నా ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం ప్రభుత్వ స్థలమంటూ ఆరోపిస్తున్న రెవెన్యూ అధికారులు ఇక్కడ బోర్డు సైతం ఏర్పాటు చేశారు. కాని ప్రస్తుతం కొంత మంది ఈ స్థలంలో పనులు చేయడం పట్ల ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రైవేటు స్థలమని అధికారుల సర్వే..

ఇక్కడ వివాదంలో ఉన్న స్థలం సర్వే నం.326కు చెందిందని మండల సర్వేయర్ అధికారికంగా సర్వే నిర్వహించి రిపోర్టును సైతం అందజేశారు. అయినా దౌర్జన్యంగా ఇలాంటి చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసమమని పలువురు పేర్కొంటున్నారు. రాజకీయ కక్షతోనే తనపై కొందరు కావాలని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కొలను శ్రీనివాస్‌రెడ్డి పేర్కొంటున్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తాను న్యాయపోరాటం చేస్తానన్నారు.



ప్రైవేటు స్థలమని నిర్ధారించిన అధికారులు

ప్రజారోగ్యమే ధ్యేయంగా బస్తీ దవాఖానాల ఏర్పాటు



సుభాష్‌నగర్‌లో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పేదలకు అందుబాటులో వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఆయన గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆనంద్, ఎంహెచ్‌ఓ నిర్మలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మురికివాడ ప్రాంతాల్లో నివసించే జనానికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని డివిజన్లలో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు.

- సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీను బస్తీ, నర్సింహ బస్తీల్లో రూ.28 లక్షలతో నిర్మించిన కమిటీహాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని గణేష్ సొసైటీ, గంపల బస్తీల్లో ఎమెల్యే ప్రగతియాత్ర నిర్వహించారు. స్థానికంగా అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, చంద్రశేఖర్ రావు, అడప శేషు తదితరులు ఉన్నారు.

నిబంధనలు తుంగలో తొక్కి తరగతుల నిర్వహణ



బాచుపల్లిలోని ఓ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిజాంపేట్: కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు వేసవి సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బ్యాగారి వెంకటేష్ అన్నారు. గురువారం బాచుపల్లిలో ప్రైవేట్ తరగతుల నిర్వహణను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... నగరంలోని దిల్‌సుక్‌నగర్, హిమాయత్‌నగర్, అమీర్‌పేట్, మాదాపూర్, ఎస్‌ఆర్ నగర్, బాచుపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని కళాశాలలు నిబంధనలకు వ్యతిరేకంగా తరగతులు నిర్వహిస్తున్నాయని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాచుపల్లిలోని ఓ గరల్స్ కళాశాలను బంద్ చేయించి విద్యార్థులు ఇళ్లకు పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కార్తిక్, నాయకులు, జీవన్, కార్తిక్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి అన్నారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ×రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌×ను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బౌరంపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో వెంకట్, భూపతి రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం డీఆర్‌కె కళాశాల సమీపంలో ఉన్న ఎన్‌బీఆర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను రాష్ట్రంలోని యువతకు చేర వేసే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ఈ క్విజ్ పోటీల్లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ తెలంగాణ ఇన్‌చార్జ్ అక్షయ్ లక్ర, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు సదానందం, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య, నేతలు మిద్దెల యాదిరెడ్డి, మహేశ్, సురేశ్, దయానంద్, భరత్‌గౌడ్, చిరంజీవి, కార్తీక్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి

కార్మికుల హక్కుల సాధనకు బీఆర్‌ఎస్‌కేవీ కృషి



వేతన ఒప్పంద పత్రాలను అందుకుంటున్న కార్మిక నేత మదన్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు బీఆర్‌ఎస్‌కేవీ కృషి చేస్తోందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని లక్షయ్ లైసెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల కార్మికులకు గురువారం మదన్‌గౌడ్ నేతృత్వంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ భవనంలో నూతన వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు రూ.12వేల వేతన పెంపుదలతో పాటు ఇతర అలవెన్స్‌లను యథావిధిగా కొనసాగించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. కార్మికులకు ఏ కష్టమొచ్చినా బీఆర్‌ఎస్‌కేవీ అండగా ఉంటుందన్నారు. ఈ వేతన ఒప్పందం కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రమోద్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్, ప్రధాన కార్యదర్శి రంగారావు, ప్రసాద్, ఖాసీం, రాజేష్, రోశయ్య, సిహెచ్ సాంబయ్య, ముక్తేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

● ఖల్సా సజ్న దివస్



మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గండిమైసమ్మలోని జ్యోతిరావు పూలే స్టేడియంలో రోడామేస్త్రీనగర్ యూత్ ఆధ్వర్యంలో 'ఖల్సా సజ్న దివస్' క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విజేత జట్టుకు రూ.20 వేలతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు సమేందర్ సింగ్, రథన్‌సింగ్, నానక్‌సింగ్, సమ్మీసింగ్ తదితరులు పాల్గొన్నారు. – దుండిగల్

శ్యామల శ్రీనివాస్‌కు నివాళి



కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ సీనియర్ రిపోర్టర్ శ్యామల శ్రీనివాస్ (55) కొన్ని రోజులుగా అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన అంత్యక్రియలు జీడిమెట్ల ఏపీఎస్ కాలనీలో నిర్వహించారు. అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే కేపీ వివేకానంద రూ.20 వేలు, కూనమాలక్ష్మి ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ రూ.20వేల ఆర్థికసాయం చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గడ్డమీద బాలరాజు పలువురు పరామర్శించారు.

మృతురాలి కుటుంబానికి రూ.4.5లక్షల ఎక్స్‌గ్రేషియా

జీడిమెట్ల: విద్యుదాఘాతంతో మృతిచెందిన మహిళ కుటుంబ సభ్యులకు గురువారం విద్యుత్ శాఖ అధికారులు రూ.4.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించారు. గతేడాది సూరారం రాజీవ్‌గృహకల్పకు చెందిన వీరమణి(45) ఇంటిపై బట్టలు తొలగిస్తుండగా విద్యుత్‌ఘాతానికి గురై మృతిచెందింది. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ వీరమణి కుటుంబానికి డీఈ నర్సింహారెడ్డి రూ.4.5లక్షలు అందజేశారు.







వేసవి తాపం.. ఉపశమన ఫలం

వేసవి తాపంతో జనాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ప్రజలు నిమ్మరసం, చెరుకురసం, కొబ్బరినీరు, తాటిముంజలు తీసుకుంటూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. గురువారం మధ్యాహ్నం జీడిమెట్లలోని పలు ప్రాంతాల్లో చెరుక రసం తాగుతూ.. తాటి ముంజలు కొంటూ కనిపించారు. తాటి ముంజలు రాజమండ్రి నుంచి నగరానికి దిగుమతి అవుతున్నాయంటే గిరాకీ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. – జీడిమెట్ల

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికులు

నిజాంపేట్: స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. చెత్తను తరలిస్తున్న స్వచ్ఛ ఆటో, టిప్పర్ కార్మికులు గురువారం మేయర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను ఆమెకు తెలిపి వినతి పత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంద్రజిత్‌రెడ్డి, ఆగంరాజు ముదిరాజ్, ఆటో, టిప్పర్ యూనియన్ నాయకులు మల్లికార్జున్, గణేష్, మల్లికార్జున్, మోహన్ తదితరులు ఉన్నారు.

ఆ నలుగురు..

- కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌లో కీలక నేతలు
- టికెట్ తమకంటే తమకంటూ ప్రచారం
- ఈ నేతల్లో అదృష్టం ఎవరిని వరించునో.?

కుత్బుల్లాపూర్: కర్ణాటక ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీలో జోరు పెరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాలు చేపడుతూ పార్టీ నేతలు విస్తృతంగా పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏమి చేస్తామో అన్న విషయాన్ని స్పష్టంగా వివరిస్తూ ముందుకు సాగుతున్నారు.

- పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి 2018 నుంచి సీపీఆర్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయనకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అండదండలు పుష్కలంగా ఉండగా రేవంత్‌రెడ్డి సహకారం కూడా ఉందని ప్రచారం చేసుకుంటున్నాడు.
- అదేవిధంగా 1986 నుంచి పార్టీలో ఉంటూ వస్తున్న మరో ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సైతం తనకి టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాహుల్ గాంధీ పాదయాత్రలో కీలకంగా వ్యవహరించి ఆయన అధిష్టానం దృష్టిలో పడ్డారు. రేవంత్‌రెడ్డి ఆశీస్సులు సైతం ఉన్నాయని ప్రచారం ఉంది.
- ఇదే క్రమంలో పీసీసీ ప్రతినిధి కొలను హనుమంత్‌రెడ్డి 70 రోజులుగా హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రను చేస్తున్నారు. తప్పకుండా ప్రజల్లో ఉంటున్న ఆయన టికెట్ వస్తుందని ధీమాతో ఉన్నారు.
- అదేవిధంగా మొదటి నుంచి టీపీసీసీ అధ్యక్షుడికి అత్యంత సన్నిహితంగా ఉండే జ్యోత్స్న శివారెడ్డి సైతం టికెట్ కోసం రేసులో ఉన్నారు.
- అయితే పార్టీ అధిష్టానం ఈ నలుగురిలో ఎవరికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తారన్నది అంతుచిక్కకుండా ఉంది. ఎవరికివారు పోటీపడి ప్రచారంలో మునిగిపోతూ తమ ఉనికిని చాటుకుంటూ ముందుకు సాగుతుండగా ఒకే సామాజిక వర్గానికి చెందిన వీరిలో ఎవరికో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ వరించే అవకాశం ఉందని ఆ పార్టీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

